
కథ




# మందు భాష్యుడు

బులుసు-జీ-ప్రకాష్

నా భార్య చెల్లెలు--మరదలు దగ్గర్నుంచీ సూక్ష్మాతి సూక్ష్మంగా ఒక లేఖ.

"బావగారూ! ఆయన తాగుడు మితిమీరిపోతోంది, మీరు తక్షణమే వచ్చి విరుగుడు సూచించండి!" అని ఆ లేఖలోని 'సారా'ంశం. సరే! తప్పుతుందా? బట్టలు సర్దుకుని మన రాష్ట్రరాజధానికి బయలుదేరాను.

"అన్నగారూ! రండి రండి. మా వదినగారు పిల్లలూ బావున్నారా?" కుశల ప్రశ్నలు వేశాడు మా తోడల్లుడు. అప్పుడతను వటాసులో లేడు.

"ఆః అంతా బావున్నారు, భగవంతుడి దయవల్ల" అన్నాన్నేను.

మా మరదలు ఉత్తరం రాసిందని చెబితే, ఎందుకు? ఏమిటి? అని ఆరా తీసి, సారా తాగి, మళ్లీ ఆమెను చితక బాత్తాడు. అంచేత చిన్నకోత కోశాను. అప్పుడప్పుడు చిన్నచిన్న కోతలు కోయకపోతే వీల్లేదు. అదైనా ఒక మంచి కోసం. నేనసలే విద్యుచ్ఛక్తి శాఖలో పనిచేసిన 'కోతల'రాయుణ్ణి! గ్యాస్ కంపెనీవాళ్లు గ్యాస్ కబుర్లు చెప్పినట్లు!

"ఈ ఊళ్లో ఒక ముఖ్యమైన పని పడ్డాది. ఒక ఎడిటర్‌గార్ని కలవాలి. ఓ నవల రాశాను. వారికి చదివి వినిపిద్దామని" అన్నాను.

"మీరు భోంచేసి విశ్రాంతి తీసుకుని మరీ వెళ్లండి. నాకు ఆఫీసుకి టైమయింది. వెళ్తొస్తాను" అని అతను ఆఫీసుకి వెళ్లిపోయాడు.

వాల్మీకి మహర్షి ముందుగానే రామకథని 'దివ్యదృష్టి' అనే టీవీలో చూసినట్లు మా మరదలు మా తోడల్లుని మందుకథని కళ్లకు కట్టినట్లు చెప్పింది.

"దీనకంతటికీ ఒకటే పరిష్కారం వుందమ్మాయ్. అతనిచేత అయ్యప్పమాల వేయించి మండలదీక్ష పూనేటట్లు చేయడం" అన్నాన్నేను.

"అయితే మీరే ఆ పిల్లికి గంటకట్టి పుణ్యం కట్టుకోండి" అందామె.

"ప్రయత్నిద్దాం. తర్వాత

దైవేచ్ఛ" అన్నాను. ఈ రోజుల్లో 'చేసి తీరుతాను. ష్యూర్! గన్‌షాట్!' అనడానికి లేదు. ఆచరణలో పెట్టినప్పుడు ఎన్ని ఎదురు దెబ్బలు తినాలో? మనం వేసిన పథకాలు ఎన్నో తలక్రిందులవుతూంటాయి.

సాయంత్రం మా తోడల్లుడు దయచేశాడు. అయితే కొద్దిగానే మందు పుచ్చుకున్నాడు.

"ఏమిటి తమ్ముడూ! మరి మందు మానలేవా?" అన్నాను.

"అనుకుంటున్నాను గాని మానలేకపోతున్నాను అన్నగారూ!" అన్నాడు.

"మానడం కష్టమేమీ కాదు. ఒకేసారి మానడం కష్టమే. రోజుకో ఫుల్ బాటిల్ అలవాటనుకో. పదిరోజులు హాఫ్ వేసుకో. మరో పదిరోజులు క్వార్టర్ అక్కణ్నుంచీ నిల్!" అని ఓ ఉచిత సలహా పారేశాను.

ఇంతలో ఆ వీధిని మండలదీక్ష పూని ఇరుముళ్లు పట్టుకుని వెళుతున్న ఓ అయ్యప్ప స్వాముల సమూహం నల్ల దుస్తులు ధరించి, పాదరక్షలు లేకుండా, "స్వామియే శరణమయ్యప్పా!" అని అయ్యప్ప స్వామిని బిగ్గరగా పిలుస్తూ వెళుతున్నారు.

కనులవిందు చేసే ఈ దృశ్యం చూడగానే నా మనసులో ఒక విద్యుల్లత మెరిసింది.

మా తోడల్లుని చేత అయ్యప్పమాల వేయిస్తే? ఆయన ఒప్పుకుంటాడా? లేకపోతే "నువ్వెవిడివి చెప్పడానికి? ఏదో పెద్దవాడివి కదాని మర్యాద ఇస్తూంటే మరీ నా పర్సనల్ విషయాల్లోకి జోక్యం చేసుకుంటున్నావే!" అని గొంతు హెచ్చిస్తే నా పరిస్థితేమిటి? నా తల నేను ఎక్కడ పెట్టుకోవాలి?

"తమ్ముడూ! నేను నీకంటే పెద్దవాణ్ని ఔనా?" అన్నాను.

"అందుకు సందేహమెందుకు? అందుకే కదా మిమ్మల్ని 'అన్నగారూ!' అని సంబోధిస్తున్నాను.

"నువ్వు అయ్యప్పస్వామి దీక్ష పూనాలని నా కోరిక. అలా అయితే నలభైఒక్క రోజులపాటు మండలదీక్ష వహిస్తే ఇంద్రియ నిగ్రహం అలవడుతుంది. నల్లటి దుస్తులు ధరించడం, కాళ్లకు పాదరక్షలు లేకుండా నడవడం, రోజూ రెండుపూటలా చన్నీళ్ల స్నానం చేసి మూడు దేవాలయాల ప్రదక్షిణం, దైవదర్శనం, కటిక నేల మీద పడుక్కోవడం ఇలా చేయడం వల్ల దుర్వ్యసనాలకు దూరంగా ఉండడం అలవడతాయి" అని మినీ లెక్చర్ ఇచ్చాను.

అతను ఏ కళనున్నాడో లేక అయ్యప్పస్వామి తనలో ప్రవేశించి మకరవిలక్కునాడు వెలిగించే జ్యోతిని, ముందుగానే తనలో వెలిగించాడో తెలీదుకాని, అతను "అలాగే కానీండి. మీరు పెద్దలు, నా శ్రేయోభిలాషులు మీ మాటెందుకు కాదనాలి?" అన్నాడు.

తలుపుచాటున నిలబడి చూస్తున్న మా మరదలు రెండు చేతులూ జోడించి, మీదకు చూచి, కళ్లు మూసుకుని నమస్కరించడం గమనించాను.

మొదటిసారిగా మాల వేసుకున్న స్వాములను 'కన్నెస్వాము'లని అంటారు. ఎలాగైతేనేం, ఆ కన్నెస్వాముల జాబితాలో మా తోడల్లుడూ చేరాడు. ఆ కన్నెస్వాములందరూ ఓ గదిలో వేరేగా తామే వంట చేసుకోవడం అయ్యప్ప భజనలు చేయడం పూర్తిగా చెడు అలవాట్లకు స్వస్తి చెప్పడం జరిగింది.

ముందుగానే మాట్లాడుకున్న కాంట్రాక్టు బస్సులో మిగిలిన కన్నెస్వాములందరితో పాటు భజనలు చేసుకుంటూ, లక్షలాది మంది భక్తులతో, గజగజ వణికించే చలిలో, చలినే మరిచిపోయి ప్రయాణమయ్యాడు మా తోడల్లుడు.

నేను మళ్లీ నా స్వస్థలం చేరుకున్నాను.

మండలదీక్ష పూర్తయ్యాక తిరిగి వస్తున్నప్పుడు, తిరుమల వెళ్లి తలనీలాలు సమర్పించుకుని, ఇంకా మార్గమధ్యంలో బెజవాడ కనకదుర్గని, అన్నవరం సత్యనారాయణ స్వామిని, సింహాద్రి నారసింహుని దర్శించుకుని అందరు భక్తులతో పాటు ఇంటికి వచ్చారని మా మరదలు ఫోన్ చేసింది. 'సంతోషం' అనుకున్నాను.

కాని నా సంతోషానికి నాల్రోజుల్లోనే బ్రేకు పడ్డాది.

"డ్యూటీలో జాయినయిన నాల్రోజులకి మళ్లీ మా మరదలు నుండి ఫోను!"

"బావగారూ! మళ్లా మీ తోడల్లుడు యథాస్థితిని మించిపోయి అధికస్థితికి వచ్చేశారు. ఇంతకుముందు ఒక బాటిల్ వేసుకునే ఆయన, పాతబాకీలు సెటిల్ చేసుకుంటూ రోజుకు రెండు బాటిల్స్ కొడుతున్నారు. నాకేమీ పాలుపోవడం లేదు!" అని ఎస్ ఓ ఎస్ (సేవ్ అవర్ సోల్స్) ఇచ్చింది.

"తల్లీ! ఇహ నేనేమీ చేయలేను!" అని ఫోన్ పెట్టేశాను.

అతను సన్మార్గంలో పడతాడని అయ్యప్పస్వామి మాల వేయించాను. తథాగతుడు, ఏసుప్రభువు, మహమ్మద్ ప్రవక్త, మహాత్మా గాంధీ వంటి మాన్యమహోదయులు కనబడి 'నాయనా, త్రాగుడు మాను! లేకపోతే ఆ త్రాగుడే నిన్ను త్రాగేస్తుంది!' అని హెచ్చరించినా వారు తాగుడు మానలేరు! మనబోటి సామాన్యులం చెప్పడం ఏ పాటి?

మందభాగ్యులను బాగుచేయడానికి పునరావాస కేంద్రాలున్నాయి, కాని 'మందు' భాగ్యులను బాగుచేయడం ఎవరి తరం? అని తూర్పుకి తిరిగి రెండు చేతులూ ఎత్తేశాను! ■

